క్లుప్తంగా

వైభవంగా పార్వేట ఉత్సవం


ఊరేగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి

శ్రీకాళహస్తి: చెన్నైరోడ్డులోని ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామివారి పార్వేట ఉత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం పార్వేట ఉత్సవం నిర్వహించారు. దీంతో ధర్మరాజస్వామి వార్షిక ఉత్సవాలు ముగిశాయి.

గర్భిణులకు వైద్యపరీక్షలు


గర్భిణికి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం గర్భిణులకు వైద్యాధికారి దివాకర్ వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ గర్భం దాల్చిన వెంటనే ఏఎన్ఎం వద్ద పేరు నమోదు చేసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేసుకుని, రక్త హీనత రాకుండా మందులు వాడాలన్నారు. ఆస్పత్రిలో కాన్పు జరిగితే జననీ సురక్ష పథకం కింద రూ.వెయ్యి ఇస్తారన్నారు.

యూనిఫామ్ పంపిణీ


యూనిఫామ్ అందుకున్న విద్యార్థులతో డైనమిక్ సిటిజన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు డైనమిక్ సిటిజన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూనిఫామ్ వితరణ చేశారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు సంస్థ ప్రతినిధులు యూనిఫామ్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, సంస్థ ప్రతినిధులు రామసుబ్బయ్య, బాలకృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఏర్పేడు: క్రీడలతో మానసికోల్లాసం, శరీరదారుఢ్యం పెరుగుతుందని ఉపాధ్యాయురాలు శాంతకుమారి అన్నారు. బుధవారం శిక్షా సప్తాహ్ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో విద్యార్థులకు క్రీడల పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శిక్షా సప్తాహ్ వారోత్సవాలు ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలన్నారు. నూతన విద్యావిధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు


తిరుమల(ఫైల్)

ఏర్పేడు: మండలంలోని చింతలపాళెంలో భర్త అదృశ్యంపై భార్య బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు తెలిపారు. సీఐ కథనం మేరకు.. మండలంలోని చింతలపాళెం గ్రామానికి చెందిన గంటా తిరుమల(35) సొంత పనులపై ఈ నెల 21వ తేదీన తిరుపతికి వెళ్లాడు. ఇప్పటి వరకు తిరుమల ఇంటికి తిరిగి రాలేదని, దీంతో తిరుపతితోపాటు బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. కనిపించకపోవడంతో అతడి భార్య గంటా సుజాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వ్యక్తులు 9440900729 నంబర్‌కు సమాచారం అందించాలని సీఐ చెప్పారు.

అందుబాటులోకి వరదయ్యపాళెం బీసీ హాస్టల్


బీసీ హాస్టల్‌లో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

సాక్షి ఎఫెక్ట్..

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ ఎట్టకేలకు తెరుచుకుంది. హాస్టల్ విద్యార్థులకు సోమవారం నుంచి అందుబాటులోకి వచ్చినట్లు హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్ రామయ్య తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 40 రోజులు గడిచినప్పటికీ హాస్టల్ తెరుచుకోకపోవడంతో ఈ నెల 17వ తేదీన సాక్షిదినపత్రికలో తెరుచుకోని వరదయ్యపాళెం బీసీ హాస్టల్ అన్న కథనాన్ని ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా యంత్రాంగం హాస్టల్‌ను ప్రారంభించారు. నూతన అడ్మిషన్లను కూడా నమోదు చేసుకుంటున్నట్లు వార్డెన్ పేర్కొన్నారు.

కోనకు పోదాం.. సందడి చేద్దాం


సీబీటీసీ ప్రవేశ ద్వారం

పక్షుల కిలకిల రావాలు.. చల్లటి పిల్లగాలి తెమ్మెరలు.. నింగికి నిచ్చెనల్లా వృక్షాలు.. నిరంతరం జాలువారే జలధారలు.. చుట్టూ ఎత్తైన కొండల నడుమ పరచుకున్న పచ్చదనం.. పరవశించిపోయే ప్రకృతి సోయగాలు.. ఆధ్యాత్మికతను పంచే కామాక్షాంభిక సమేత కైలాసనాథస్వామి ఆలయం కైలాసకోన సొంతం. అంతటి పర్యాటక కేంద్రంలో నేడు ఆటవిడుపునకు ఆధునిక వసతులతో అందుబాటులోకి రానున్నాయి. ఈ క్షేత్రాన్ని సందర్శించి, అందరూ సందడి చేయవచ్చు.

- ఆటవిడుపునకు కొత్త హంగులు
- పర్యాటకుల ఆకర్షణే ప్రధాన లక్ష్యం
- పూర్తి కావస్తున్న అభివృద్ధి పనులు

నారాయణవనం: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోనను సందర్శించే పర్యాటకులు, భక్తులు, పిలల్ల కోసం ఆధ్యాత్మిక చింతనకు తోడు ఆటవిడుపును కల్పించే దిశలో అటవీ శాఖ ఏర్పాట్లు చేపడుతోంది. ఇప్పటికే పిల్లల కోసం పార్కు, బోటింగ్, ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు, సరదాగా కాలినడకన తిరిగేందుకు జెంగిల్ సఫారీ పనులు కొనసాగుతున్నాయి. కమ్యూనిటీ బేస్డ్ టూరిజం సెంటర్(సీబీటీసీ) పేరుతో జరుగుతున్న అభివృద్ధి పనులతో స్థానికంగా ఉంటున్న యానాది కుటుంబాలకు జీవనోపాధి మెరుగుపడనుంది.

కైలాసకోన.. ప్రకృతి పరవశం

ప్రకృతి సోయగాలతో ఎత్తైన కొండల నడుమ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న కైలాసనాథ కోన ఉంది. జలపాతం పీటం వద్ద కామాక్షాంభిక సమేత కైలాసనాథస్వామి కొలువై ఉన్నారు. సుమారు 120 అడుగుల ఎత్తు నుంచి కిందకు ఉరికే జలపాతం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ జలపాతాన్ని సందర్శించే వారికి ఆటవిడుపు తోడై, మరింత ఆకర్షణీయంగా మారనుంది.

సీబీటీసీకి పూర్వ వైభవం

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతో అప్పటి పంచాయతీరాజ్ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కైలాసనాథకోనలో అటవీశాఖ స్థానిక యానాదుల సహకారంతో కమ్యూనిటీ బేస్డ్ టూరిజం సెంటర్ (సీబీటీసీ)ని ఏర్పాటు చేసింది. స్థానిక యానాదులే నిర్వహించే రెస్టారెంట్, బోటింగ్, నవగ్రహ వృక్ష వనాన్ని ఏర్పాటు చేసింది. మహానేత మృతి, రాష్ట్ర విభజనతో సీబీటీసీ నిరాధరణకు గురికావడం, విభజన తర్వాత ప్రభుత్వం పూర్తిగా విస్మరించడంతో ఈ కేంద్రం ఉనికి కోల్పోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవడంతో గత ఏడాది అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యాటక క్షేత్రాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే కైలాసనాథకోనలో సీబీటీసీ పిల్లల పార్కును అభివృద్ధి చేసింది.

ఆకట్టుకుంటున్న పిల్లల పార్కు

కైలాసనాథకోనకు వచ్చే పిల్లల కోసం జలపాతం మార్గం తొలి మలుపులో మంచి తీర్థ కోన మార్గంలో అటవీశాఖ ఏర్పాటు చేసిన పార్కు అందుబాటులోకి వచ్చింది. పిల్లలు ఆడుకోవడానికి జారుడు బల్ల, ఫజిల్ లాడర్, ఊయలలు ఏర్పాటు చేశారు. రూ. 20 చెల్లిస్తే, పిల్లలు రోజంతా పార్కులో గడిపే వెసులుబాటు ఉంది. పార్కు నుంచి కొంత ముందుకు వెళితే మంచి తీర్థ కొన జలపాత పీఠం వద్ద నేచురల్ స్విమ్మింగ్ పూల్‌ను సిద్ధం చేస్తున్నారు. వర్షాలకు మాత్రం జలపాతంలో నీరు ప్రవహించే కారణంతో సహజ ఈత కొలనుకు ఏడాదిలో సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకే పర్యాటకులను అనుమతించనున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ముస్తాబవుతున్న సీబీటీసీ

కైలాసకోన జలపాతంలో నిరాధరణకు గురైన సీబీటీసీని పర్యాటకుల కోసం అటవీశాఖ ముస్తాబు చేస్తోంది. పూర్తి స్థాయిలో ఫుడ్ స్టాళ్లు, విశ్రాంతి గదులను ఏర్పాటు చేస్తున్నారు. ఫెడల్ బోట్లను మరమ్మతులు చేసి, బోటింగ్ పాండ్‌ను అభివృద్ధి చేస్తున్నారు. అడవిలో విహరించడానికి కాలినడక దారిని సుమారు మూడు కిలోమీటర్ల మేరకు ఏర్పాటు చేస్తున్నారు. సేద తీరడానికి వృక్షాల మధ్య అరుగుల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఈ పనులన్నీ పూర్తి అయిన తరువాత సీబీటీసీ పునఃప్రారంభమైతే స్థానిక యానాదుల జీవనోపాధి మెరుగుపడే అవకాశం ఉంది.


కైలాసనాథకోన జలపాతం


పార్కులో ఏర్పాటు చేసిన బల్లలు


పిల్లల పార్కులో ఆటల మైదానం


విశ్రాంతి గది, వాచ్ టవర్

స్థానికులకే ప్రాధాన్యత

పర్యాటకులకు ఆధ్యాత్మికతతో పాటు మానసిక ఉల్లాసం కోసం, పిల్లల ఆటవిడుపునకు ఏర్పాటు చేస్తున్న పార్కు, జాగింగ్ ట్రాక్, పిల్లల పార్కు, ఫెడల్ బోటింగ్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. స్థానికంగా ఉంటున్న 42 యానాది కుటుంబాల ఉపాధి లక్ష్యంగా సీబీటీసీ పనిచేస్తోంది. ఫుడ్ స్టాళ్లు, అటవీ ఉత్పత్తుల విక్రయాలు, నిర్వహణ పూర్తిగా 42 కుటుంబాల వారే చూసుకుంటారు. అటవీశాఖ పర్యవేక్షణలో సీబీటీసీ ఆదాయం జాయింట్ ఖాతాలో జమ చేస్తున్నాం. ఆదాయం పూర్తిగా 42 కుటుంబాలకే చెల్లిస్తాం.

-వెంకటసుబ్బయ్య, ఫారెస్ట్ రేంజర్, కార్వేటినగరం

ఓడీఎఫ్ సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలి

సత్యవేడు: ఓడీఎఫ్ సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ కే.చంద్రశేఖర్ పంచాయతీ కార్యదర్శకులు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో ఎంపీడీఓ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ మల మూత్ర విసర్జనను పూర్తిగా నిర్మూలించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఓడీఎఫ్ సర్వేలు చేపట్టిందన్నారు. మండల పరిధిలో గతంలో 8,300 మరుగుదొడ్లు నిర్మించారని, ఇంటింటా మరుగుదొడ్డి ఉందా? సెప్టిక్ ట్యాంకు ఉందా? లేదా గుర్తించి యాప్‌లో నయోదు చేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లు సమన్వయంతో సర్వే పూర్తి చేయాలన్నారు. డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్య నారాయణ, ఈఓపీఆర్డీ ముని రవికుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా


నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: సామాజిక ప్రయోజనాల కోసం ప్రజల్లో తన రచనల ద్వారా చైతన్యాన్ని రగిల్చిన కవి సామ్రాట్, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు యువశ్రీమురళి అన్నారు. బుధవారం గుర్రం జాషువా వర్ధంతిని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రం జాషువా సమాజంలోని హెచ్చు తగ్గులను వెతికి, దానికి గల కారణాలను పరిశీలించి, చతుర్వర్ణ వ్యవస్థను నిలదీసేలా తన రచనలో తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్, ఉపాధ్యాయులు సురేష్‌బాబు, వేణుగోపాల్, నాదెండ్ల మురళి, ఒబ్బు ప్రసాద్, దేవేంద్ర, దాసు, లక్ష్మయ్య, జగన్నాథం, మాధవీలత, దీపిక, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అంకురార్పణ


పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆడికృత్తిక ఉత్సవాలకు సోమవారం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఆలయంలోని చెంగల్వరాయస్వామి సన్నిధిలో పూజలు చేశారు. మంగళవారం విజ్ఞానగిరిపై ఉన్న కుమారస్వామి ఆలయంలో ధ్వజారోహణం కార్యక్రమం జరగనుంది. ఈఓ ఎస్వీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్లకు కట్టుదిట్టమైన భద్రత

రేణిగుంట: జిల్లాలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో వినియోగించి ఈవీఎంలను భద్రపరచిన గోదాము వద్ద నిరంతర పటిష్ట భద్రత, సీసీ కెమెరాల నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం ఆయన ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ గోడౌన్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను ఆయన తనిఖీ చేశారు. రాజకీయ పార్టీల సమక్షంలో గోదాములో భద్రపరచిన ఈవీఎం యంత్రాలు బీయూలు, సీయూలు, వీవీ ప్యాట్‌లను, అక్కడి భద్రతా చర్యలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఎన్నికలలో వాడని డిఫెక్టివ్ బ్యాలెట్ యూనిట్లు 160, కంట్రోల్ యూనిట్లు 49, 124 వీవీ ప్యాట్‌లను శ్రీకాళహస్తి డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు వెంట కట్టుదిట్టమైన ఎస్కార్ట్ భద్రత నడుమ డీజీటీ వాహనంలో బెంగళూరులోని బెల్ కంపెనీకి పంపుతున్నామని ఆయన తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయా ? అని, పోల్ అయిన ఈవీఎంల సీల్‌లు యథాతథంగా ఉన్నాయా ? లేదా ? అని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. సెంట్రల్ వేర్ హౌసింగ్ సొసైటీ మేనేజర్ రమేష్ బాబు ఈ సందర్భంగా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈవీఎం గోడౌన్ ఇన్‌చార్జ్ కోదండ రామిరెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఎలక్షన్ డీటీ పవన్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా కట్టడికి చర్యలు


రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న సిబ్బంది

రేణిగుంట: గంజాయి అక్రమ రవాణా కట్టడికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు రైల్వే డీఎస్పీ షేక్ షాను, రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ స్పష్టం చేశారు. రేణిగుంట రైల్వేస్టేషన్‌లో బుధవారం రాత్రి ఆర్పీఎఫ్, జీఆర్పీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా గంజాయి అక్రమ రవాణా, మద్యం, మానవ అక్రమ రవాణాపై విస్తృత తనిఖీలు చేపట్టారు. సర్క్యులేటింగ్ ఏరియా, పార్సిల్ ఆఫీసులు, వెయిటింగ్ హాళ్లు, ప్లాట్ ఫామ్‌లలో తనిఖీలు చేశారు. ఆటో, టాక్సీ డ్రైవర్లతో కూడా మాట్లాడి అనుమానాస్పదంగా వస్తువులు తీసుకెళుతున్న వారిని గమనించి చిన్నపాటి సందేహం కలిగినా తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రేణిగుంట ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సందీప్‌కుమార్, రేణిగుంట అర్బన్ సీఐ మల్లికార్జున, జీఆర్పీ ఎస్ఐ రవి పాల్గొన్నారు.

28న ఉచిత మెగా వైద్య శిబిరం

వరదయ్యపాళెం: మండల కేంద్రంలో ఈ నెల 28వ తేదీన ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీసిటీలోని శ్రీరామచంద్రా మెడికల్ సెంటర్ (ఎస్ఆర్ఎంసీ), శ్రీసిటీ ఫౌండేషన్, పాందూరు శ్రీకోదండరామస్వామి సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వరదయ్యపాళెంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరంలో సాధారణ వ్యాధులు, స్త్రీ సంబంధిత వ్యాధులు, చర్మ వ్యాధులు, పిడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ సమస్యలకు సంబంధించి ప్రత్యేక వైద్య నిపుణుల బృందం వైద్య సేవలు అందిస్తారన్నారు. ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇతర వివరాలకు 9080605607, 08576-293329 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

ఏర్పేడు: వరకట్న వేధింపులకు పాల్పడిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు బుధవారం తెలిపారు. సీఐ కథనం మేరకు.. మండలంలోని పాపానాయుడుపేట గ్రామానికి చెందిన వలత్తూరు బాలకృష్ణ కుమార్తె సునీతను తమిళనాడు రాష్ట్రం, చెన్నైలోని పెరంబుదూర్‌కు చెందిన సెల్వం కుమారుడు మురళీకృష్ణకు ఇచ్చి నాలుగేళ్ల క్రితం వివాహం చేశారు. వివాహ పమయంలో 25 సవర్ల బంగారు ఆభరణాలు, 30 లక్షల నగదు వరకట్నంగా సునీత తల్లిదండ్రులు అందజేశారు. అయితే ఇటీవల కొంతకాలంగా అదనపు కట్నం కోసం భర్త మురళీకృష్ణ, కుటుంబ సభ్యులు సెల్వం, లక్ష్మీ, పుష్పలత మానసికంగా, శారీరకంగా వేధిస్తుండడంతో బాధితురాలు ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నారాయణవనం: మండలంలోని జాతీయ రహదారిపై నైనారుకండ్రిగ సమీపంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన వెలుగు చూసింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. నింద్ర మండలం ఐఆర్ కండ్రిగకు చెందిన మల్లీశ్వరి బుధవారం ఉదయం మండలంలోని జాతీయ రహదారిపై ఐఆర్ కండ్రిగ క్రాస్‌రోడ్డు సమీపంలో నిలుచుకుని ఉండగా, నాగలాపురం నుంచి పుత్తూరు వైపు వెళ్తున్న ట్యాంకర్ లారీ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. లారీ చక్రాలు మల్లీశ్వరి తలపై పోవడంతో పూర్తిగా ఛిద్రమైంది. డ్రైవర్ కిలోమీటర్ దూరంలో ఉన్న నైనారుకండ్రిగ సమీపంలో లారీని ఆపి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లారీని పోలీసుస్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

నేడు ధ్వజారోహణం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శ్రీవల్లి దేవసేన సమేత చెంగల్వరాయస్వామి సన్నిధిలో ఆడికృత్తిక మహోత్సవాలకు గురువారం ధ్వజారోహణం నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 5 గంటలకు యాగశాల వద్ద పూజలు, రాత్రి 8 గంటలకు వెండి అంబారీపై స్వామి అమ్మవార్లు ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంచండి


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌బాబు

నారాయణవనం: ఆధునిక పోకడలకు తోడు చదువులో పోటీతత్వం కారణంగా విద్యార్థి దశ నుంచే పిల్లలు క్రీడలకు దూరం అవుతున్నారని, వారికి ఆటపై ఆసక్తి పెంచాలని పలువురు పేర్కొన్నారు. మండలంలోని పాలమంగళం ఉన్నత పాఠశాలలో బుధవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా స్పోర్ట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన జరిగిన సమావేశంలో విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ పోటీతత్వం పెంచుకోవడంతో విద్యార్థులు బాల్యంలో ఆటలకు దూరమవుతున్నారన్నారు. ఆటలతో మానసికంగా, శారీరకంగా దృఢంగా ఎదుగుతూ, అవాంతరాలను ఎదుర్కొనే మనస్థత్వాన్ని పొందుతారన్నారు. నచ్చిన ఆటను రోజూ సాధన చేయడం దినచర్యగా చేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మనోహరి, పీడీ రాజా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసిన సూళ్లూరుపేట ఆర్డీఓ


వరదయ్యపాళెం ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రముని

సాక్షి ఎఫెక్ట్..

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ నెల 17వ తేదీన ఎస్సీ హాస్టల్‌లో వసతులు, అపరిశుభ్రతపై సాక్షి దినపత్రికలో 'సంక్షేమమా..నువెక్కడా?' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ చేసి, అక్కడ వసతుల గురించి ఆరా తీశారు. అలాగే రోజువారీ అందుతున్న ఆహార నాణ్యత మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. శుభ్రత విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం చేయవద్దని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు. వంటగది పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అలాగే మరుగుదొడ్లు, స్నానపు గదులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్‌కు ప్రహరీ గోడ నిర్మించాలని, అప్పుడే విద్యార్థులకు భద్రత ఉంటుందని విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆర్డీఓ తక్షణమే హాస్టల్‌కు కేటాయించిన స్థలం వివరాలు అందజేస్తే ప్రహరీగోడ నిర్మాణం కోసం నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ వేణుగోపాల్, వీఆర్వోలు నాగేంద్ర, చలపతి, హాస్టల్ వార్డెన్ రాజా రమేష్ ఉన్నారు.

ఉపకరణాలతో అత్యుత్తమ బోధన సాధ్యం


మాట్లాడుతున్న డీవైఈఓ ప్రభాకర్‌రాజు

శ్రీకాళహస్తి: బోధనోపకరణాలతో ఉపాధ్యాయులు అత్యుత్తమ బోధన సాధ్యమవుతుందని పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్‌రాజు అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని జెడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం బోధనోపకరణాలపై ఉపాధ్యాయులు ఇస్తున్న శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశంలో అన్ని విభాగాల్లో నాణ్యమైన బోధన కొనసాగించేందుకు బోధనోపకరణాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు తరగతి గదిలోఉపాధ్యాయుల బోధనను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమలో ఏఎంఓ విజయ, ఎంఈఓ భువనేశ్వరి, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక లాభాలు


ఎరువు పంపిణీ చేస్తున్న డాక్టర్ ఏఆర్ రెడ్డి

రేణిగుంట: పంట సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతుల అవలంబించడంతో అధిక లాభాలు సాధించవచ్చని హైదరాబాద్ ఐసీఏఆర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏఆర్ రెడ్డి అన్నారు. మండలంలోని కరకంబాడి పంచాయతీ వనస్థలిలో బుధవారం రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పంట యాజమాన్య పద్ధతుల ద్వారా రైతుకు సాగు ఖర్చు తగ్గి, ఆశించిన ఆదాయం వస్తుందని తెలిపారు. సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులతో పంట దిగుబడి, నాణ్యత పెరుగుతుందని తెలిపారు. అనంతరం రైతులకు మందులు, రసాయన ఎరువులను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ఎస్ శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు సుధాకర్, దివ్య, పద్మజ, శ్రీలత, అనూష తదితరులు పాల్గొన్నారు.